


ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళా కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయడంతో బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఒక్కసారిగా రైలుకు ఎగబడిన ప్రయాణికులు


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 20 ఫిబ్రవరి 2025 | HYDERABAD




రోజురోజుకూ నెమ్మదిగా ఎండల తీవ్రత పెరిగిపోతూ ఉన్నది.. దీంతో మధ్యాహ్నం వేళల్లో ఉష్ణ ప్రతాపాన్ని తట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్న ఓ ఆటోడ్రైవర్



# ఆ 105 ఆస్తులను ఏంచేస్తారో?

**కేబీఆర్ పార్కు చుట్టూ ఆస్తుల స్వాధీనంపై స్పష్టత లేకుండా బల్దియా ప్రతిపాదనలు**

**గతంలో రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను తిరస్కరించిన సభ్యులు**

**జానారెడ్డి బాటలోనే కాంగ్రెస్ నేత చంద్రశేఖర్ రెడ్డి తీవ్ర అభ్యంతరం**

**నేడు స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : అంతా హడావుడి తప్ప ప్రణాళిక ఉండదు. కార్యాచరణ అస్సలు రూపొందించరు. సమావేశాల మీద సమావేశాలు పెడుతారు కానీ నిర్ణయాలు తీసుకోవడంలో ఎడతెగని జాప్యం చేస్తారు. ఇదీ బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ తీరు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో 15 అంశాలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించి ఆమోదం తెలపనున్నారు. ముఖ్యంగా ఈ స్టాండింగ్ కమిటీ సమావేశంలో హెచ్ సిటీ ప్రాజెక్టు పనుల్లో భాగంగా భూ సేకరణకు ప్రాధాన్యత ఇచ్చారు. అయితే గత స్టాండింగ్ కమిటీలో సభ్యులు తిరస్కరించిన ప్రతిపాదనలనే మళ్లీ ఈ సమావేశంలో పొందుపర్చడం, కొత్తగా కేబీఆర్ పార్కు చుట్టూ ఎవరెవరి ఆస్తులను గుర్తించారు? ప్రముఖులు ఎవరు ఉన్నారు? అన్న సమగ్ర వివరాలు లేకుండానే రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ ఆమోదానికి పంపడం దీనికి సభ్యులు ఎలా స్పందిస్తారన్న చర్చనీయాంశమైంది. ముఖ్యంగా కేబీఆర్ పార్కు చుట్టూ హెచ్ సిటీ ప్రాజెక్టు కింద తమ ఆస్తులను ఇచ్చేందుకు ఇప్పటికే కాంగ్రెస్ సీనియర్ నేత జానా రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడం, ఇటీవల సినీ హీరో అల్లు అర్జున్ మామ, కాంగ్రెస్ నేత చంద్రశేఖర్ రెడ్డి సైతం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చి నిరసన తెలిపిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే నేటి సమావేశంలో 105 ఆస్తులకు సంబంధించి సభ్యులు ఏ విధంగా స్పందిస్తారన్న ఉత్కంఠగా మారింది. వీటితో పాటు బండ్లగూడ మండలం కందికల్ గ్రామంలో మిధాని బస్‌స్టేషన్, బస్ డిపో నిర్మాణానికి టీజీఎస్ ఆర్టీసీకి కేటాయించిన 5.37 ఎకరాల ప్రభుత్వ భూమికి ఎన్ఓసీ జారీ చేసేందుకు జీహెచ్ఎంసీకి సిఫారసు చేస్తూ కమిటీ ఆమోదానికి ప్రతిపాదించారు. బుద్ధభవన్‌లో నాలుగో అంతస్తు ఏ బ్లాక్‌లో తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ లీజు వ్యవధి తదుపరి రెండు సంవత్సరాల పొడగింపునకు , అద్దె పెంపు, బోరబండలోని స్లమ్ ఏరియాలో నిరుద్యోగ యువత, నిరుపేద మహిళలకు సీఎస్ఆర్ కింద లైట్ హౌస్ కమ్యూనిటీ ఫౌండేషన్ సొంత నిధులతో సెంటర్ ఫర్ స్కిల్లింగ్ అండ్ లవ్లీ హుడ్ ప్రోగ్రాం ద్వారా శిక్షణలు నిర్వహించేందుకు ఒక ఏడాది పాటు జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌ను స్వాధీనం చేసేందుకు అనుమతి ప్రతిపాదనపై సభ్యులు చర్చించనున్నారు.

## రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్‌లోకి చేరికలు

**గులాబీ కండువా కప్పుకున్న 200 మంది కాంగ్రెస్ కార్యకర్తలు**

**పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి సబిత, కార్తిక్ రెడ్డి**

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 19: భారత రాష్ట్ర సమితికి ప్రజల్లో ఏమాత్రం ఆదరణ తగ్గలేదని రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు చెందిన 200 మందికి పైగా కాంగ్రెస్, ఎంఐఎం నాయకులు, మహిళా కార్యకర్తలు అధిక సంఖ్యలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డితో కలిసి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో 24 గంటల విద్యుత్ ఉండేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంధకారం అలుముకుందని చెప్పారు. రైతు భరోసా, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, దళిత బంధు, ఉచిత విద్యుత్, ఉచిత మంచినీరు వంటి అనేక పథకాలను పేదల సంక్షేమానికి ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌దేనని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ వచ్చినప్పటి నుంచి ఏ ఒక్క పథకం అమలు చేయకపోగా 6 గ్యారెంటీ హామీలును గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ రోజు రోజుకు బలమైన శక్తిగా ఎదుగుతున్నదన్నారు. పూర్వవైభవం తెచ్చుకుంటూ పార్టీ ముందుకు పురోగమిస్తున్నదన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు ఇప్పటి నుంచే సిద్ధం అవుతున్నారన్నారు. కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్.వెంకటేష్, సర్వర్, వహజ్, ఫారుఖ్, మోహిన్, ఖాన్, రాముయాదవ్, రాఘవేందర్‌యాదవ్, రవి, ఈశ్వర్, వెంకటేష్, రాజు, చిరంజీవి, రాజ్‌కుమార్, అశోక్ కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, కార్తిక్‌రెడ్డి

# ధ్రువపత్రాల జారీలో జాప్యం!

**పది రోజులు గడిచినా చేతికి అందని జనన, మరణ సర్టిఫికెట్లు**

**30 సర్కిళ్లలో 3500ల మేర పెండింగ్ జాబితాలోనే**

**మెడికల్ ఆఫీసర్లు, ఏఎంసీలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు**

**జీహెచ్ఎంసీ పనితీరుపై ప్రజల ఆగ్రహం**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జనన, మరణ ధ్రువపత్రాల జారీ ప్రక్రియలో తీవ్ర జాప్యం నెలకొంటున్నది. వారం రోజుల వ్యవధిలో చేతికి అందాల్సిన జనన, మరణ ధృవపత్రాలు 2 వారాలు గడిచినా అందడం లేదు. ఫలితంగా ఈ సర్టిఫికెట్ల కోసం అటు తల్లిదండ్రులు, ఇటు డెత్ సర్టిఫికెట్లకు బాధిత కుటుంబ సభ్యులు మీ సేవా కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలకు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పది రోజులు గడిచినా జనన ధృవపత్రం ఆన్‌లైన్‌లో రావడం లేదని బన్సీలాల్ పేటకు చెందిన మహాలక్ష్మి అనే గృహిణి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, 30 సర్కిళ్ల పరిధిలోని దాదాపు 3500 సర్టిఫికెట్ల పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తున్నది. సంబంధిత ఏఎంఓహెచ్‌లు, ఏఎంసీలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమి కారణంగానే సర్టిఫికెట్ల జారీలో ఆలస్యం అవుతూ సమస్యకు కారణమవుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

### తప్పుల తడక.. ఇంకో సమస్య

జీహెచ్ఎంసీ పరిధిలో జారీ అయ్యే బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు తప్పుల తడకగా ఉంటున్నాయి. దీంతో ధృవపత్రాలు పొందేవారికి ఇది ఇంకో సమస్యగా మారింది. ఒక్కో సర్కిల్‌లో దాదాపు 500 నుంచి 700 వరక కరెక్షన్ ఫైళ్లు పెండింగ్‌లో ఉండడం అధికారుల పనితీరును నిదర్శనంగా చెప్పవచ్చు . వాస్తవంగా జీహెచ్ఎంసీ పరిదిలోని 30 సర్కిళ్లలో ప్రతి ఏటా గరిష్టంగా మూడున్నర లక్షల వరకు జననాలు జరుగుతున్నాయి. వీటిలో ప్రైవేట్ దవాఖానాలో జనరేట్ చేస్తున్న బర్త్ సర్టిఫికెట్లలో తప్పులు తక్కువగా ఉంటుండగా..ప్రభుత్వ ఆసుపత్రుల్లో నమోదవుతున్న ధ్రుపపత్రాల్లో తప్పులు దొర్లుతున్నట్లు తెలుస్తున్నది. బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీకి సంబంధించిన రిజిస్ట్రార్లుగా స్థానిక మెడికల్ ఆఫీసర్లు వ్యవహరిస్తుంటారు. కానీ చాలా సర్కిళ్లలో మెడికల్ ఆఫీసర్లు లేకపోవడంతో అసిస్టెంట్ మెడికల్ కమిషనర్లు (ఏఎంసీ)లను బర్త్, డెత్ రిజిస్ట్రార్లుగా నియమించారు. ఈ నేపథ్యంలోనే బేగంపేట సర్కిల్ పరిధిలోని గాంధీ ఆసుపత్రి, గోషామహల్ సర్కిల్ పరిధిలోని సుల్తాన్ బజార్ ప్రభుత్వ దవాఖాన, పేట్ల బురుజులోని సర్కారు వెటర్నరీ హాస్పిటల్, మెహిదీపట్నం సర్కిల్‌లోని నిలోఫర్ దవాఖానా పరిధిలో భారీగా కరెక్షన్ ఫైళ్లు పెండింగ్‌లు ఉన్నట్లు సమాచారం.

# 544 కోట్లతో.. ఎస్ఎన్‌డీపీ రెండో దశ

**మురికి నాలాపై సమగ్ర సర్వే చేయాలి**

**పాత బస్తీలోని పలు ప్రాంతాల్లో నాలాలను పరిశీలించిన కమిషనర్**



పాతనగరంలో పర్యటిస్తున్న కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ)/చార్మినార్ : రోడ్డు అభివృద్ధి ప్రణాళిక తరహాలోనే హైదరాబాద్ నగరంలో వరద నీరు సజావుగా సాగిపోయేలా అభివృద్ధి, నిర్వహణ విస్తరణను నిర్ధారించడానికి నాలాల అభివృద్ధికి మాస్టర్ ప్రణాళిక అవసరమని కమిషనర్ ఇలంబర్తి పేర్కొన్నారు. బుధవారం ఉదయం యాకత్‌పురాలోని పలు స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌లను స్థానిక ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కార్పొరేటర్‌లతో కలిసి కమిషనర్ ఇలంబర్తి పరిశీలించారు. యాకుత్ పురా మురికి నాలాపై సమగ సర్వే చేయాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. పాత నగరంలో ప్రజలకు ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో ఎస్ఎన్‌డీపీతో నాలా పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రేటర్‌లో రూ. 545 కోట్ల వ్యయంతో ఎస్ఎన్‌డీపీ రెండో దశ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. పాత నగరంలో చేపట్టిన పనులు వచ్చే వర్షాకాలం వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

### పలు ప్రాంతాల్లో పర్యటన

పాతనగర పర్యటనలో భాగంగా కమిషనర్ పలు ప్రాంతాలైన రంగేలి కిడికి, హుస్సేన్ కోటి, మౌలానా చిల్ల, గంగా నగర్, రెయిన్ బజార్‌లలో పర్యటించారు. ముందుగా రంగేలి కిడికి వీధిలో మురుగు నీరు ఓవర్ ఫ్లోను పరిశీలించారు. జహంగీర్ నగర్ నుండి గంగా నగర్ మురికి కాలువ నిజాం కాలంలో చేపట్టిన నాలా అయినందున గత వర్ష కాలంలో వరదకు పొంగిపోయిన నేపథ్యంలో మురికి నీరు వస్తున్నాయని మెయింటెనెన్స్ ఈఈ కమిషనర్‌కు వివరించడంతో మురుగు నీటి నాలా పై సమ్రగ సర్వే చేయాలని, నిజాం కాలం నాటి మురికి కాలువ అయినందున నాలాల పరిస్థితి తెలుసుకోవలసిన అవసరం ఉందన్నారు. మురుగు నాలా సమ్రగ సర్వే చేసి పూర్తి నివేదిక అందజేయాలని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత మౌలానా చిల్ల వద్ద గంగా నగర్ నాలాను పరిశీలించారు. రెయిన్ బజార్ పాత బాక్స్‌డ్రెయిన్ లో వర్షపు నీరు వెళ్లక వరద నీటి నిలిచిపోవడంతో ఇళ్లకు నీరు వస్తుందని కాలనీ వాసులు కమిషనర్‌కు చెప్పారు. దీంతో బాక్స్ డ్రెయిన్ పనులు చేపట్టేందుకు రూ.1.60 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు ఎమ్మెల్యే కమిషనర్‌ను కోరగా పని యొక్క సమగ్ర నివేదికను పంపించాలని ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు.

# గాయం ఒక చోటైతే.. మందు మరో చోట

**ఇసుక చిరు వ్యాపారులపై పోలీసుల ప్రతాపం..!**

**శివారులలో ఇసుక వ్యాపారుల ఆవేదన**

**చిన్న నిర్మాణాలకు ఇసుక కావాలంటే కష్టమే..**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ): నదులు, వాగుల పరీవాహక ప్రాంతాల్లో యథేచ్ఛగా ఇసుక దందా సాగుతూ ఉంటే పోలీసులు మాత్రం హైదరాబాద్ నగరంలో చిరువ్యాపారులపై విరుచుకుపడుతున్నరు. గాయం ఒకచోటైతే మందు మరొక చోట పెట్టినట్టు ఇసుక రీచ్‌లు, నదీ పరివాహక ప్రాంతాలు లేని హైదరాబాద్‌లో అక్రమ ఇసుక దందా నడుస్తూ ఉందంటూ వ్యాపారులను వేధిస్తున్నారు. కాగా ఇసుక నిల్వ చేసుకోవడం తప్ప తాం ఏం నేరం చేశామో అర్థం కావడం లేదని వ్యాపారులు విస్మయానికి గురవుతున్నారు.

### నిర్మాణాలపై ప్రభావం..!

యథేచ్ఛగా సాగుతున్న ఇసుక దందాపై ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి దృష్టిపెట్టారు. అయితే ఈ నేపథ్యంలోనే కృష్ణా నది, గోదావరి నది పరీవాహక ప్రాంతాలపై దృష్టి పెట్టాల్సిన అధికారులు ఇసుకు నిల్వ చేసుకున్న చిరు వ్యాపారులపై తమ ప్రతాపం చూపిస్తున్నారు. ముఖ్యంగా రాచకొండ కమిషనరేట్ పరిధిలో వ్యాపారులకు వేధింపులు అధికం అయ్యాయి. సాధారణంగా ఇసుక రీచ్‌లు ఉన్న తుపాకులగూడెం, భద్రాచలం, కరీంనగర్, పెద్దపల్లి తదితర ప్రాంతాలలో ప్రభుత్వానికి నిబంధనల ప్రకారం ఇసుక ధర చెల్లించి లారీలలో హైదరాబాద్‌కు ఇసుకను రవాణా చేస్తుంటారు. కొందరు లారీల యజమానులు నేరుగా బహుళ అంతస్తుల నిర్మాణాలకు సరఫరా చేస్తుండగా ఇంకా కొందరు అడ్డాలపై తెచ్చి పెడుతుంటారు. ఈ అడ్డాల వద్ద నుంచి చిన్న చిన్న నిర్మాణాలకు తక్కువ మొత్తంలో ఇసుక కావాల్సిన వాళ్లు కొనుగోలు చేస్తుంటారు. దీంతో పాటు లారీలు ఎక్కువ సేపు ఇసుకతో ఉండలేవు, దీంతో కొందరు ఆ ఇసుకను కొనుగోలు చేసి ఖాళీ ప్రదేశాలను కిరాయికి తీసుకొని, లీజ్‌లకు తీసుకొని దానిని ఇసుక డంప్(డంగల్)గా వాడుకుంటారు. ఇక్కడి నుంచి రెండు మూడు టన్నులు అవసరాలను బట్టి చిన్న చిన్న వాహనాలలో కొనుగోలు చేసుకుంటూ కావాల్సిన వాళ్లు తీసికెళ్తుంటారు. అయితే లారీలో తెచ్చిన ఇసుకను కొని, దానిని ఈ చిరువ్యాపారులు రీసేల్ చేస్తుండడంతో కొద్ది మేర ధరను పెంచుకుంటారు. నిబంధనల ప్రకారం ఇసుక రీచ్‌ల నుంచి తెచ్చిన ఇసుకనే ఇక్కడ కొని దానిని విక్రయిస్తున్నారు. ఇలా నగరంతో పాటు నగర శివారు ప్రాంతాలలో ప్రధాన రోడ్లకు సమీపంలో ఇసుక డంప్‌లు ఏర్పాటు చేస్తూ వేలాది మంది ఈ వ్యాపారంపై ఆధారపడి నడుచుకుంటున్నారు. అవసరమైన వారికి ఇసుకను అందించడంలో ఇలాంటి డంప్‌లు పట్టణ ప్రాంత వాసులకు ఉపయోగపడుతున్నాయి. నిర్మాణాలకు కావాల్సిన ఇసుక ఇక్కడి నుంచి ఎక్కువగా సరఫరా అవుతుంది. అలాకాకుండా నేరుగా ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను కొనాలంటే తక్కువ మొతాదులో కావాల్సిన వారికి దొరకడం కష్టంగా మారుతుంది. ఇది నిర్మాణరంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశాలున్నాయి.

### కావాలంటే నిల్వకు లైసెన్సులు తీసుకుంటాం

శివారులలో ఇసుకను కొని నిల్వచేసి విక్రయించే వ్యాపారం గత 30 ఏండ్లుగా సాగుతున్నది. అలాంటిది ఇప్పుడు ఈ వ్యాపారాన్ని నిలిపివేయాలని, ఇది అక్రమ ఇసుక దందాకు కారణమవుతుందంటూ దీనిపై ఆధారపడి ఉన్న వ్యవస్థను మొత్తం ప్రభుత్వం ధ్వంసం చేస్తున్నదంటూ పలువురు వ్యాపారులు వాపోతున్నారు. కావాలంటే లైసెన్స్‌లు పెట్టుకునే వెసులుబాటు కల్పిస్తే తాము అందుకు సిద్ధమని వ్యాపారులు చెబుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఇలాంటి సమస్య పరిష్కారానికి అబ్దుల్లాపూర్‌మెంట్ ప్రాంతంలో ఇసుక డంప్ చేసుకునే కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారని వ్యాపారులు పేర్కొంటున్నారు. అక్రమంగా ఇసుకను తరలించే వాహనాలను ఆయా ప్రాంతాలలోని చెక్‌పోస్టుల వద్దే నిలువరించే అవకాశాలున్నా ప్రభుత్వ యంత్రాంగం అక్కడ ఏమీ చేయలేక తమలాంటి చిరు వ్యాపారులపై విరుచుకుపడితే తామేం చేయగలమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.







## ఇసుక డంపులపై పోలీసుల దాడులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): ఇసుకను నిల్వ చేసిన వ్యాపారులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు కొనసాగుతున్నాయి. బుధవారం సౌత్ వెస్ట్ జోన్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా నాంపల్లి మండల రెవెన్యూ అధికారులతో కలిసి ఇసుక డంపులపై దాడులు నిర్వహించారు. పక్కా సమాచారంతో పురానాపూల్‌లోని జుమ్మెరాత్ బజార్‌లో ఉన్న సందీప్ వేబ్రిడ్జ్, సందీప్ కన్‌స్ట్రక్షన్ అండ్ మెటీరియల్ గోడౌన్‌పై దాడులు చేసి 1.20లక్షల విలువ చేసే 60 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు.

**ఈ నెల 22 నుంచి మార్చి 29 వరకు**

## ప్రతి శనివారం ఆస్తి పన్ను పరిష్కారం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : ఆస్తి పన్ను సమస్యల పరిష్కారానికి 'ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం' (పీటీపీ) కార్యక్రమాన్ని ఈ నెల 22 నుంచి 29 వరకు ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సర్కిల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. గ్రేటర్ పరిధిలోని ప్రజలకు ఆస్తిపన్ను సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పీటీపీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆస్తిపన్ను సమస్యలు, పున : సమీక్ష అభ్యర్థనలు, ఆస్తిపన్ను అంచనాల్లో సవరణలు, బిల్ కలెక్టర్లు, ఆర్‌టీజీఎస్ చెల్లింపులు, ఆన్‌లైన్ బకాయిలు సరిచేయడం, కోర్టు కేసుల పరిష్కారం, ఐజీఆర్ఎస్ సమస్యలు, స్వీయ మదింపు సంబంధిత విషయాలు, ఇతర పన్ను సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం ఈ నెల 22, మార్చి 1, 8, 15, 22,29 తేదీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డిప్యూటీ కమిషనర్ కార్యాలయాలలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆస్తిపన్నుకు సంబంధించిన ఏవైనా సమస్యలున్న వారు తమ సంబంధిత జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఆయా తేదీలలో నిర్వహించే 'ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం' కార్యక్రమంలో సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

